Voice of Vande Bharath

వాయిస్ ఆఫ్ వందే భారత్

TGTEL/25/A4812

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 97 | పేజీలు : 04| వెల: రూ.3/-

తెలంగాణ

శుక్రవారం | నవంబర్ 06, 2026

డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనలతోనే బ్యారేజీల పునరుద్ధరణ

సీఎం రేవంత్ రెడ్డి

ఎన్‌డీఎస్‌పీ మార్గదర్శకాలకు అనుగుణంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణ

రూ. 4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు..

నిర్మాణ లోపాల మరమ్మతుల వ్యయం కాంట్రాక్ట్ సంస్థలదే



2లో..



అయ్యప్ప సొసైటీలో

సీఎం కుటుంబ సభ్యుల అక్రమ దందాలు

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- హైకోర్టు ఉత్తర్వులను సైతం తుంగలో తొక్కి అక్రమ అనుమతులు
- కాంగ్రెస్ హయాంలో 500 నుంచి 700 అక్రమ నిర్మాణాలు
- నెల రోజుల్లో చర్యలు తీసుకోకపోతే అక్రమ భవనాలకు రెడ్ మార్క్ వేస్తాం



2లో..

గులాబీ గూటికి నిర్మల్ యువ నాయకుడు నల్ల వినయ్ రెడ్డి

- కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన వినయ్ రెడ్డి
- గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన కేటీఆర్
- 11న నిర్మల్‌లో కేటీఆర్ 'రైతు గర్జన' బహిరంగ సభ



4లో..

మహాకవి దాశరథి

చిరస్మరణీయుడు

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- దాశరథి కృష్ణమాచార్యకు నివాళి



4లో..

వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, నవంబర్ 06, 2026

విజయవంతంగా ముగిసిన 5వ తెలంగాణ పోలీసు గేమ్స్

- 3 స్వర్ణాలు, 1 రజత పతకంతో దూసుకెళ్లిన టీజీఎస్పీ జోన్-1



వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : 5వ తెలంగాణ రాష్ట్ర పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో టిజివిస్పి జోన్-1 క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో మెరిసారు. ఈ క్రీడా పోటీల్లో జోన్-1 జట్టు మొత్తం 3 స్వర్ణ పతకాలు, 1 రజత పతకాన్ని కైవసం చేసుకుని విజేతగా నిలిచింది. పోటీల్లో జోన్-1 క్రీడాకారులు అసాధారణ ప్రతిభ కనబరిచి హ్యాండ్‌బాల్, ఖో-ఖో మరియు సెపక్ తక్రా విభాగాలలో మొదటి స్థానంలో నిలిచి 3 స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. అలాగే, తీవ్ర ఉత్కంఠ నడుమ హోరాహోరీగా సాగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుచుకున్నారు. పోటీల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఐజీ చంద్రశేఖర్ రెడ్డి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కఠినమైన పోలీసు విధులతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ చాటడం అభినందనీయమని కొనియాడారు. ఇదే పట్టుదలతో రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, డీసీపీలు రాజా మహేంద్ర నాయక్, అంకిత్ కుమార్, కవిత, మరియు 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాసరావు, అడిషనల్ కమాండెంట్ వంశీ మోహన్ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్లు నాగభూషణం, వీరన్న, ఆర్ఐ కార్తీక్ తదితర ఉన్నతాధికారులు పాల్గొని విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. జోన్-1 క్రీడాకారుల ఘన విజయం పట్ల బెటాలియన్ సిబ్బంది, పోలీసు యంత్రాంగం హర్షం వ్యక్తం చేశారు.

డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనలతోనే బ్యారేజీల పునరుద్ధరణ

- సీఎం రేవంత్ రెడ్డి
- ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల పునరుద్ధరణ
- రూ. 4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు..
- నిర్మాణ లోపాల మరమ్మతుల వ్యయం కాంట్రాక్ట్ సంస్థలదే
- ఈ ఏడాది చివరి నాటికి పనులు ప్రారంభించాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశం

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కేంద్ర ప్రభుత్వ సంస్థలు, జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల సూచనలకు అనుగుణంగానే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రులు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్ది ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు. గత హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ఉంటే తక్కువ ఖర్చుతో ప్రాణహిత నీటిని ఎల్లంపల్లికి తెచ్చే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.

• లిఫ్ట్ చేయడం సాంకేతికంగా అసాధ్యం:

మేడిగడ్డ వద్ద నీరు ఉన్నప్పటికీ లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని సీఎం సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ నీటిని లిఫ్ట్ చేయడం సాంకేతికంగా సాధ్యం కాదని ఇంజనీర్లు ముఖ్యమంత్రికి స్పష్టం చేశారు. నీటిని ఎల్లంపల్లికి తరలించాలంటే అన్నారం, సుందిళ్ల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని, అయితే నిర్మాణ లోపాలున్న ఆ బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్డీఎస్ఏ స్పష్టంగా హెచ్చరించిందని వివరించారు.

• దేవాదుల, సీతారామ ద్వారా రికార్డు నీటి తరలింపు:

గోదావరి నీరు వృథా కాకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల ద్వారా రికార్డు స్థాయిలో నీటిని లిఫ్ట్ చేసి ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకు సాగు, తాగునీరు అందించామని సీఎం తెలిపారు. దేవాదుల ద్వారా గతంలో ఏటా సగటున 9.57 టీఎంసీలు ఎత్తిపోస్తే, ఈ మూడేళ్లలో సగటున 18.13 టీఎంసీల నీటిని (89 శాతం అధికంగా) లిఫ్ట్ చేశామని చెప్పారు. అక్టోబర్ నాటికి దేవాదుల (16.71 టీఎంసీలు), సీతారామ (8.10 టీఎంసీలు) ద్వారా మొత్తం 24.81 టీఎంసీల జలాలను సద్వినియోగం చేసుకున్నామన్నారు.

• రూ. 4,193 కోట్లతో పునరుద్ధరణ ప్రణాళికలు..

బ్యారేజీల పునరుద్ధరణ ప్రణాళికను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు రూ. 4,193 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. నిర్మాణ లోపాల వల్ల వచ్చిన మరమ్మతుల ఖర్చును ఆయా నిర్మాణ సంస్థలే (ఏజెన్సీలు) భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించారు. పునరుద్ధరణ ప్రాథమిక ప్రణాళికలకు కేంద్ర నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని అధికారులు వెల్లడించారు.



• ఈ ఏడాది చివరి నాటికి పనులు ప్రారంభం:

ఈ నెలాఖరులోగా అవసరమైన తుది అనుమతులు సాధించి, ఈ ఏడాది చివరికల్లా పునరుద్ధరణ పనులు ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే పనులు, రక్షణ పనులను రెండు దశల్లో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి సీహెచ్.శ్రీధర్, టన్నెల్స్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో ప్రజలు విలవిల..

- ◇ హైదరాబాద్‌కు 'వాటర్ లాక్‌డౌన్'!
- ◇ మాటలు కోటలు దాటుతున్నా నీరు గడప దాటడం లేదు
- ◇ బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి
- ◇ వేసవికి ముందే నగరంలో తీవ్ర నీటి సంక్షోభం
- ◇ పీజీ హాస్టళ్లు మూతపడి సొంతూళ్లకు తరలుతున్న విద్యార్థులు



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగర ప్రజలు తాగునీటి కోసం విలవిలలాడుతున్నారని, నగరంలో 'వాటర్ లాక్‌డౌన్' పరిస్థితులు నెలకొన్నాయని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో మాటలు కోటలు దాటుతున్నాయని, కానీ ప్రజలకు కనీసం తాగునీరు కూడా అందడం లేదని ఆయన మండిపడ్డారు. గ్లోబల్ సిటీ అని గొప్పలు చెప్పుకోవడం తప్ప, నగరవాసుల దాహార్తిని తీర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సైబరాబాద్ పరిధిలో 2,500కు పైగా పీజీ హాస్టళ్లు నీటి కొరతతో మూతపడే స్థితికి వచ్చాయని గోవర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 8 వేలకు పైగా ట్యాంకర్ బుకింగ్‌లు వస్తున్నాయంటే నీటి కొరత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వేసవి రాకముందే వేలాది బోర్లు ఇంకిపోతున్నా ప్రభుత్వ వద్ద ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేదు. ప్రైవేట్ ట్యాంకర్లు అడ్డగోలుగా ధరలు పెంచి విక్రయిస్తున్నా ప్రభుత్వం నియంత్రించలేకపోతోంది. నీటి సౌకర్యం లేక ఐటీ ఉద్యోగులు 'వర్క్ ఫ్రమ్ హోమ్' వైపు, విద్యార్థులు సొంత ఊళ్లకు తిరిగి వెళ్లాల్సి రావడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం.

• శాశ్వత పరిష్కారం చూపాలి:

కృష్ణా, గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా శాశ్వత తాగునీటి సరఫరా వ్యవస్థను ఎందుకు బలోపేతం చేయడం లేదని ప్రశ్నించారు. కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితం కాకుండా, తక్షణమే స్పందించి హైదరాబాద్ నగరంలో తాగునీటి సంక్షోభానికి శాశ్వత పరిష్కారం చూపాలని మన్నె గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

అయ్యప్ప సొసైటీలో సీఎం కుటుంబ సభ్యుల అక్రమ దందాలు

- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- హైకోర్టు ఉత్తర్వులను సైతం తుంగలో తొక్కి అక్రమ అనుమతులు
- కాంగ్రెస్ హయాంలో 500 నుంచి 700 అక్రమ నిర్మాణాలు
- నెల రోజుల్లో చర్యలు తీసుకోకపోతే అక్రమ భవనాలకు రెడ్ మార్క్ వేస్తాం



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని అయ్యప్ప సొసైటీని చెరబట్టి అక్రమంగా దోచుకుంటున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రౌండ్ వాటర్ లేని అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో ఒక్క ఇటుక కూడా పేర్చవద్దని స్పష్టమైన హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, నిబంధనలను పక్కనబెట్టి సీఎం సోదరులే దగ్గరుండి అక్రమ అనుమతులు ఇప్పిస్తూ కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గురుకుల ట్రస్ట్ భూముల్లో అక్రమంగా 500 నుండి 700 భవనాలు నిర్మించారని, ప్రస్తుతం మరొక 80 భవనాలు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. రిజిస్ట్రేషన్లకు అవకాశం లేకపోవడంతో నోటరీల ద్వారా అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని, ప్రజలు ఈ ప్రాంతంలో ఇళ్లు, ప్లాట్లు కొనవద్దని విజ్ఞప్తి చేశారు. ఖానామెట్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాలపై కథనాలు కవర్ చేసేందుకు వెళ్లిన విలేకరులను బిల్డర్లు బెదిరిస్తున్నారని, వెనుక సీఎం సోదరుల అండ ఉండటం వల్లే రౌడీ రాజ్యం నడుపుతున్నారని మండిపడ్డారు. మూసీ గర్భంలో అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఆదిత్య బిల్డర్స్ సీఎం ఇద్దరు సోదరులకు చెరొక విల్లా ఇచ్చారని, అందుకే వారి అక్రమ ప్రాజెక్టులకు అనుమతులిచ్చారని ఆరోపించారు. అయ్యప్ప సొసైటీలోని అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం నెల రోజుల్లో చర్యలు తీసుకోకపోతే తమ పార్టీ శ్రేణులే వెళ్లి అక్రమ భవనాలకు 'రెడ్ మార్క్' వేస్తాయని హెచ్చరించారు. రాష్ట్రంలో 18 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, సమాచార హక్కు చట్టం ఉండి కూడా ప్రజలకు ప్రయోజనం లేకుండా పోయిందని మండిపడ్డారు. రాష్ట్రంలో 320 మండలాలు కరువుతో అల్లాడుతుంటే హైదరాబాద్ వచ్చిన కేంద్రమంత్రి అమిత్ షా రూపాయి సాయం ప్రకటించకుండా కేవలం కౌంటర్ రాజకీయాలు చేసి వెళ్లారని విమర్శించారు. నిధులు తేలేని బీజేపీ నాయకులు నీళ్లు లేని బావిలో దూకాలన్నారు. తన వద్ద ఒక్క ఇంచు అసైన్డ్ భూమి ఉన్నా ప్రభుత్వానికే రాసిస్తానని, ఎలాంటి విచారణకైనా సిద్ధమని స్పష్టం చేశారు. సీఎం, మంత్రుల మధ్య సమన్వయం లేక విద్యుత్ కోతలు, కృష్ణా-గోదావరి నీటి నిర్వహణలో లోపాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో మహిళలు పెద్ద ఎత్తున ఓటు నమోదు చేసుకుని తమ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, నవంబర్ 06, 2026

పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు

- జీవో నంబర్ 24 జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నంలకు గూడూరి శ్రీనివాస్ కృతజ్ఞతలు



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణలోని పద్మశాలి సామాజిక వర్గానికి రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. హైదరాబాద్ పరిసర ప్రాంతమైన రంగారెడ్డి జిల్లా, గండిపేట మండలం, కోకాపేట పరిధిలో పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులను మంజూరు చేస్తూ బిసి సంక్షేమ శాఖ జీవో నంబర్ 24ను జారీ చేసింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ సంతోషం వ్యక్తం చేస్తూ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతోనే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. మంజూరైన రూ. 5 కోట్ల నిధులతో విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించనున్నట్లు జీవోలో పేర్కొన్నారు. ఈ భవనం పద్మశాలి సమాజ అభివృద్ధికి, విద్యార్థులు, యువత, చేనేత కార్మికులు, మహిళలు, ఉద్యోగుల సామాజిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తుందని చైర్మన్ తెలిపారు. పద్మశాలి సమాజ ఆత్మగౌరవాన్ని పెంపొందించే ఈ నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, సీనియర్ ఐఏఎస్ అధికారి రాహుల్ బొజ్జ సంబంధిత అధికారులకు గూడూరి శ్రీనివాస్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. పద్మశాలి సమాజ సంక్షేమానికి కార్పొరేషన్ నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

పట్టభద్రుల ఓటరు జాబితా తయారీకి సహకరించాలి

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : మహబూబ్‌నగర్ – రంగారెడ్డి – హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి నూతన ఓటరు జాబితా తయారీ ప్రక్రియకు అన్ని వర్గాల ప్రజలు, యాజమాన్యాలు పూర్తి సహకారం అందించాలని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కోరారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఫారం-18 ద్వారా దరఖాస్తులు స్వీకరించేందుకు 2026 సెప్టెంబర్ 28, అక్టోబర్ 15, అక్టోబర్ 25 తేదీలలో బహిరంగ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.ఫారం-18 ద్వారా అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు నియమించబడిన అధికారులు, బూత్ స్థాయి అధికారులు దరఖాస్తుదారులు పేర్కొన్న చిరునామాల్లో విచారణ జరిపేందుకు అధికారం కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. అయితే, కొన్ని గేటెడ్ కమ్యూనిటీలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలు మరియు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు తమ ప్రాంగణాల్లోకి బీఎల్ఓలను అనుమతించకపోవడం వల్ల విచారణకు ఆటంకం కలుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత ప్రాంగణాల యాజమాన్యాలు అధికారులను అనుమతించి దరఖాస్తుల ధృవీకరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరి పేర్లను ఓటరు జాబితాలో చేర్చేందుకు ఎలాంటి ఆటంకాలు కల్పించకుండా జీహెచ్ఎంసీ, ఎన్నికల యంత్రాంగానికి సహకరించాలని కమిషనర్ కోరారు.

మధుయాష్కిని కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : వరంగల్ – ఖమ్మం – నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌ను గురువారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన సర్వోత్తమ్ రెడ్డికి మధుయాష్కి గౌడ్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ భేటీలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ వివరాలను సర్వోత్తమ్ రెడ్డి వివరించారు. రాబోయే ఎన్నికల్లో తనకు పూర్తి సహకారం అందించాలని, ప్రచారంలో క్రియాశీలకంగా పాల్గొనాలని మధుయాష్కి గౌడ్‌ను కోరారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన అనేకమంది పట్టభద్రులు ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలో నివాసముంటున్న విషయంపై వీరిద్దరి మధ్య ప్రధానంగా చర్చ జరిగింది. ఎల్‌బీనగర్‌లోని ఓటర్ల సహకారం కోసం వనస్థలిపురంలో ఉన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ, ప్రచారం కోసం వినియోగించుకోవచ్చని మధుయాష్కి గౌడ్ సూచించారు. కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు తమ వైపు నుంచి పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

గర్భిణీలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

- 100 శాతం టీకా లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి
- హైదరాబాద్ డిఎంహెచ్ఓ డా. పుట్ల శ్రీనివాస్
- అర్హులైన బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందించాలి
- బోలక్‌పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, గర్భిణీలు మరియు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.పుట్ల శ్రీనివాస్ ఆదేశించారు. అంబర్‌పేట్ పరిధిలోని బోలక్‌పూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. సాయిబాబాతో కలిసి సందర్శించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్, రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఉచిత ఔషధాల లభ్యత, ల్యాబొరేటరీ కేంద్రం, రికార్డులతో పాటు పరిసరాల పరిశుభ్రతను డిఎంహెచ్ఓ పరిశీలించారు. సమయపాలన & సేవా నాణ్యత: వైద్యాధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి. 100 శాతం వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి. పిల్లలకు పూర్తిస్థాయిలో టీకాలు వేయడంతో పాటు, టీకాల శీతలీకరణ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలి. అర్హులైన బాలికలను గుర్తించి వారికి హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను త్వరితగతిన ఇప్పించాలి. నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ సర్వే, స్క్రీనింగ్ మరియు ఫాలో అప్ ప్రతిరోజూ చేస్తూ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అవసరమైన మందులన్నింటినీ నిల్వ ఉంచాలి. డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటింటి సర్వేలు నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించాలి. ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు ప్రతి ఒక్క అర్హుడికి చేరేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డిఎంహెచ్ఓ ఆదేశించారు. తనిఖీ సమయంలో వైద్యాధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.





పాడి కౌశిక్ రెడ్డి నీ పద్ధతి మార్చుకో..

- కాంగ్రెస్ నాయకుల తీవ్ర ఆగ్రహం

కమలాపూర్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రైతుల నుంచి వరి ధాన్యం కొనుగోలు చేసే ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్ల ప్రారంభోత్సవాలను అడ్డుకుంటూ హుజూరాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి రాజకీయాలు చేయడం తగదని, ఆయన తన వైఖరిని మార్చుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. కమలాపూర్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం, హుజూరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ వొడితల ప్రణవ్ బాబు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. రైతులు పంటను కోసి, విక్రయించడానికి నడిరోడ్డుపై ధాన్యం పోసి ఎదురుచూస్తున్న తరుణంలో... కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సహకరించాల్సిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి అధికారులను బెదిరిస్తూ, ఆటంకాలు సృష్టిస్తూ కొనుగోళ్లను ఆపివేయడం దారుణమన్నారు. తుఫాను ముప్పు పొంచి ఉండటంతో ధాన్యం తడిసి పాడవుతుందేమోనని రైతులు తీవ్ర ఆవేదన చెందుతుంటే, ఎమ్మెల్యేకి మాత్రం ఆ వేదన పట్టకపోవడం బాధాకరమని ధ్వజమెత్తారు. ఈ విలేకరుల సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం రూన్సీ రాణి రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్, ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, పోడేటి భిక్షపతి, ఆడెపు విజయ, చెర్రిపల్లి రామచంద్రం, పుల్ల శోభన్, చందుపట్ల నరసింహారెడ్డి, పల్లె సమ్మిరెడ్డి, పెరుమాండ్ల పరశురాములు, మాట్ల కళ్యాణ్, చేరాల రోహిత్, గంధసిరి అనిల్, అశోక్, చిలువేరు రవీందర్, ఎల్కటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల గోదాం తనిఖీ

హనుమకొండ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : సుబేదారి రెడ్ క్రాస్ సమీపంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదాంను హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహత్ బాజ్ పాయ్ గురువారం నెలవారీ తనిఖీల్లో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాంకు వేసిన సీళ్లతో పాటు, అక్కడ ఏర్పాటు చేసిన పటిష్ట భద్రత, పరిసరాల పరిశుభ్రత, సీసీటీవీ కెమెరాల పనితీరును కలెక్టర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రతా విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. గోదాం వద్ద భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని భద్రతా సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ తో పాటు సంబంధిత కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF VANDE BHARATH
శుక్రవారం, నవంబర్ 06, 2026

శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపన

- పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ప్రత్యేక పూజలు నిర్వహించిన వేములవాడ ఎమ్మెల్యే



వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణ పరిధిలోని నాంపల్లిలో వెలసిన శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన విప్‌కు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేవాలయాల్లో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక చింతనను పెంపొందిస్తాయని తెలిపారు. మన సంప్రదాయాలు, సంస్కృతిని భావితరాలకు అందించడంలో ఇటువంటి ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న వేములవాడ పోలీసులు

- ఫిట్స్ వచ్చి పడిపోయిన వ్యక్తికి తక్షణ ప్రథమ చికిత్స



వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ : ప్రజా రక్షణే కాకుండా, ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందించడంలోనూ తాము ముందుంటామని వేములవాడ పట్టణ పోలీసులు నిరూపించారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలో గురువారం సాయంత్రం శివ అనే వ్యక్తి అకస్మాత్తుగా ఫిట్స్ (మూర్ఛ వ్యాధి) రావడం వల్ల రోడ్డుపై కుప్పకూలిపోయాడు. అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్లు సల్మాన్, షకీల్, పంతులు నాయక్, నరేందర్, సతీష్ కుమార్, రాజ్‌కుమార్లు ఈ విషయాన్ని వెంటనే గమనించారు. వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా బాధితుడి వద్దకు చేరుకుని మానవతా దృక్పథంతో ప్రథమ చికిత్స అందించారు. చేతులు, కాళ్లు రుద్దుతూ తగిన సేవలు అందించడంతో కొద్దిసేపటికే ఆ వ్యక్తి స్పృహలోకి వచ్చాడు.విధి నిర్వహణలో ఉన్నప్పటికీ ఆపదలో ఉన్న వ్యక్తికి తక్షణ సహాయం అందించి ప్రాణాలు కాపాడిన పోలీస్ సిబ్బందిని స్థానిక ప్రజలు, ప్రత్యక్ష సాక్షులు ఎంతో అభినందించారు.

అభివృద్ధి పనుల ప్రారంభం



సంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ : సంగారెడ్డి పట్టణ అభివృద్ధియే లక్ష్యంగా పలు వార్డుల్లో నూతన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 13, 34వ వార్డుల్లో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గురువారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. పట్టణంలోని 13వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు నిర్మలా జగ్గారెడ్డి కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా 34వ వార్డు పరిధిలో మున్సిపల్ జనరల్ ఫండ్ నిధులతో చేపట్టనున్న సీసీ డ్రైన్ నిర్మాణ పనులను కూడా ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ, కౌన్సిలర్లు వీణా కిరణ్, అన్వర్, మహేష్, శ్రీకాంత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, శ్రీధర్, రాజశేఖర్ రెడ్డి, అడ్డూ, మున్నా, రాజు తదితరులు పాల్గొన్నారు.

మహాకవి దాశరథి చిరస్మరణీయుడు

- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్
- దాశరథి కృష్ణమాచార్యకు నివాళి



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తెలంగాణ సాహితీ వైభవానికి, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మహాకవి, సంఘ సంస్కర్త దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తన కలంతో ప్రపంచానికి చాటిచెప్పిన దాశరథి చిరస్మరణీయుడని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. “నా తెలంగాణ కోటి రత్నాల వీణ” అంటూ ఈ ప్రాంత గొప్పతనాన్ని, ప్రజల ఆకాంక్షలను తన కవిత్వంలో అద్భుతంగా ప్రతిబింబించిన దాశరథి, అక్షరాలనే ఆయుధాలుగా మలిచి ప్రజల్లో చైతన్యం రగిలించారని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా గళం విప్పుతూ, తెలంగాణ విముక్తి పోరాటంలో తన సాహిత్యం ద్వారా కీలక పాత్ర పోషించారని స్మరించుకున్నారు. దాశరథి రచనలు నేటికీ సమాజానికి ఎనలేని స్ఫూర్తిని అందిస్తున్నాయని, తెలంగాణ భాష, సంస్కృతి, అస్తిత్వ పరిరక్షణకు ఆయన సాహిత్యం నిరంతరం మార్గదర్శకంగా నిలుస్తుందని తెలిపారు. ఆ మహాకవి ఆశయాలను, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

బీఆర్ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు..

- గులాబీ గూటికి నిర్మల్ యువ నాయకుడు నల్ల వినయ్ రెడ్డి
- కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరిన వినయ్ రెడ్డి
- గులాబీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానం
- 11న నిర్మల్‌లో కేటీఆర్ ‘రైతు గర్జన’ బహిరంగ సభ



హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలోకి చేరికల పర్వం కొనసాగుతోంది. నిర్మల్ జిల్లాకు చెందిన యువ నాయకుడు నల్ల వినయ్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు సమక్షంలో పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలో నల్ల వినయ్ రెడ్డి కుటుంబానికి మంచి రాజకీయ నేపథ్యంతో పాటు విశేషమైన గుర్తింపు ఉంది. మాజీ సమితి ప్రెసిడెంట్ భీమిరెడ్డి మనవడైన వినయ్ రెడ్డికి స్థానికంగా బలమైన ప్రజా సంబంధాలు, ఆదరణ ఉన్నాయి. ఆయన చేరికతో నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి యువతరం నుంచి మరింత బలం చేకూరినట్లయింది. కాగా, ఈ నెల 11వ తేదీన నిర్మల్‌లో కేటీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా ‘రైతు గర్జన’ బహిరంగ సభను నిర్వహించనుంది. సభకు సమయం దగ్గరపడుతున్న వేళ నిర్మల్ ప్రాంతానికి చెందిన ముఖ్య నాయకులు పార్టీలోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

దాడి కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్ష

- ఎగ్లాస్‌పూర్ భూ వివాదం కేసులో సిరిసిల్ల కోర్టు తీర్పు
- నిందితులకు కఠిన కారాగార శిక్ష విధించిన న్యాయమూర్తి గడ్డం మేఘన



సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ : భూ వివాదం నేపథ్యంలో దాడికి పాల్పడిన కేసులో ముగ్గురు నిందితులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ సిరిసిల్ల మెజిస్ట్రేట్ గడ్డం మేఘన గురువారం సంచలన తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా కొనరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎగ్లాస్‌పూర్ గ్రామానికి చెందిన పిట్టల రాములు, పిట్టల చంద్రమౌళి, పిట్టల తిరుపతిలు 2018 మే 23న భూ వివాదం కారణంతో అదే గ్రామానికి చెందిన ఒక కుటుంబంపై దాడికి దిగారు. ఈ ఘటనలో ఫిర్యాదురాలి భర్త, మామ తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కొనరావుపేట పోలీసులు కేసు నమోదు చేసి, లోతుగా దర్యాప్తు నిర్వహించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ బలమైన వాదనలు వినిపించారు. నేరం ఆధారాలతో సహా రుజువు కావడంతో నిందితులు ముగ్గురికీ ఒక్కొక్కరికి మూడేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధిస్తున్నట్లు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో సాక్షులను సమర్థవంతంగా కోర్టులో ప్రవేశపెట్టి శిక్ష పడేలా సహకరించిన కొనరావుపేట ఎస్సైచ్ఓ బి.రామ్‌మోహన్, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ కె.శ్రవణ్, కోర్ట్ కానిస్టేబుల్ భాస్కర్‌లను అధికారులు అభినందించారు.

సుబ్రహ్మణ్యస్వామి చల్లని చూపులతో విజయం ఖాయం!

- ఎమ్మెల్సీగా రాకేష్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పలనికి పయనమైన విజయ్



వరంగల్, వాయిస్ ఆఫ్ వందే భారత్ : తన అభిమాన నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయతీరాలకు చేరాలని ఆకాంక్షిస్తూ ఆయన అభిమాని దాడి విజయ్ కుమార్ తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రం పళని సుబ్రహ్మణ్యస్వామి సన్నిధికి కాలినడకన పయనమయ్యారు. రాకేష్ రెడ్డి విజయం సాధించాలని కోరుకుంటూ విజయ్ కుమార్ పళని ఆలయంలోని 693 మెట్లను కాలినడకన ఎక్కి, నాగబంధ కావడిని మోస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. విజయ్ కుమార్‌తో పాటు ఆయన మిత్రులు వంశీ, సాయిరాం, ప్రణయ్‌లు కూడా ఈ పవిత్ర యాత్రలో పాల్గొన్నారు. ఇది కేవలం ఒక మొక్కు మాత్రమే కాదని, తమ నాయకుడిపై ఉన్న అపారమైన ప్రేమ, ఆత్మీయత మరియు అచంచలమైన విశ్వాసానికి నిదర్శనమని స్థానికులు, రాకేష్ రెడ్డి మద్దతుదారులు పేర్కొంటున్నారు. సుబ్రహ్మణ్యస్వామివారి దివ్య ఆశీస్సులతో రాకేష్ రెడ్డి ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించాలని పలువురు కాంక్షించారు.